దాసారం బస్తీలో 'జేసీబీ' టెన్షన్

- పోలీసుల రక్షణతో జేసీబీలతో పనులు
- కోర్టు ఆర్డర్స్ వచ్చాయంటూ పనులు..
- దాదాపు నాలుగు ఎకరాల స్థలం
- ఆందోళనలో 150 కుటుంబాలు

తెరమీదకు మళ్లీ దాసారం బస్తీ ఖాళీ స్థలం


దాసారం బస్తీలో జేసీబీలతో చదును చేయిస్తున్న దృశ్యం


గుమిగూడిన జనం

సనత్‌నగర్/అమీర్‌పేట: నగరం నడిబొడ్డున సనత్‌నగర్ ప్రాంతం అది. సుమారు నాలుగెకరాల స్థలం . ఇప్పటివరకు ప్రభుత్వ స్థలమే అనుకున్నారు అంతా. ఆ ధీమాతోనే దాదాపు 150 కుటుంబాలు అక్కడ గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నాయి. వారంతా ఇళ్ల నుంచి చెత్తను తరలిస్తూ పొట్టపోసుకోవడంతో పాటు స్వచ్ఛ నగరాన్ని నెలకొల్పడంలో భాగస్వాములుగా నిలుస్తున్నారు. వారు ఉండే ఈ ప్రాంతంలో జీహెచ్‌ఎంసీ తరుపున అన్ని రకాల వసతులను కూడా కల్పించారు. ఇప్పుడు ఉన్నట్టుండి కోర్టు తమకు అనుకూలంగా తీర్పునిచ్చిందంటూ తెర మీదకు రావడమే కాదు..పోలీసుల రక్షణతో జేసీబీలను దించి స్థలాన్ని చదును చేసే పనులకు దిగారు. వందల కోట్ల రూపాయల విలువ చేసే ఈ స్థలం అప్పటివరకు ప్రభుత్వ స్థలంగా భావించిన స్థానికులు ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులు తమదిగా రంగంలోకి రావడంతో ఏమి చేయాలో పాలుపోని పరిస్థితిలో పడ్డారు.

అమీర్‌పేట మండలం బీకేగూడ గ్రామ సర్వేనెంబర్ 144లో దాసారం బస్తీని ఆనుకుని దాదాపు నాలుగెకరాల స్థలం ఉంది. ఈ స్థలం విషయమై ఎన్నాళ్ల నుంచో ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల మధ్య వివాదం నడుస్తోంది. దశాబ్ద కాలం క్రితం అరబిక్ కాలేజ్, కొందరు ప్రైవేటు వ్యక్తులు, వక్ఫ్‌బోర్డు, ప్రభుత్వం ఇలా తమదంటే తమదిగా పేర్కొంటూ వచ్చారు. గతంలో కొందరు వ్యక్తులు ఏకంగా ఇక్కడ గుడిసెలు వేయించి కిరాయి కూడా వసూలు చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ దృష్టికి ఈ విషయం తీసుకురాగా ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటే అద్దెలు వసూలు చేయడమేమిటని గతంలో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ తరువత ఆ స్థలంలో పేరుకుపోయిన టన్నుల కొద్ది వ్యర్థాలను జీహెచ్‌ఎంసీ శానిటేషన్ విభాగం తొలగించి అక్కడ నివాసితులకు ఇబ్బంది లేకుండా చూశారు. ఒకానొక సమయంలో ఈ స్థలాన్ని క్రీడా మైదానంగా తీర్చిదిద్దాలని కూడా భావించారు.

మౌలిక వసతులు కల్పించిన జీహెచ్‌ఎంసీ

ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటుచేసిన అనంతరం ఇక్కడ ఉండే వారి కోసం జీహెచ్‌ఎంసీ వసతుల కల్పన కూడా జరిపింది. మంచినీటి పైప్‌లైన్లు, డ్రైనేజీ పైప్‌లైన్లు, రవీందర్‌నగర్ కాలనీ వైపు ఫెన్సింగ్, బస్తీలో రోడ్డు నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, కొంతమందికి కరెంటు మీటర్లను కూడా ఇచ్చారు. వీరికి ఓటు హక్కు కూడా కల్పించారు. ఈ క్రమంలో ఇక్కడ ఉండే దాదాపు 150 కుటుంబాలు తమకూ ఏ చింతా లేదని భావించారు.ఈ క్రమంలో పోలీసుల సహాయంతో బుధవారం సాయంత్రం ప్రభుత్వ కార్యాలయాలు మూసివేసిన అనంతరం జేసీబీలతో స్థలంలోకి వచ్చి చదును చేసే పనులు చేపట్టడంతో స్థానికుల్లో కలవరం మొదలైంది.

- దశాబ్దాలుగా తాము ఉంటున్న ఈ స్థలాన్ని ఖాళీ చేయాలని ప్రైవేటు వ్యక్తులు హుకుం జారీ చేస్తుండడంతో ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళనలో పడ్డారు.

కోర్టు ఆదేశాల మేరకే రక్షణ

దాసారం బస్తీ ఖాళీ స్థలంలో జేసీబీలతో చదును చేస్తున్న సమయంలో పోలీసులు బందోబస్తు కల్పించడంపై ఎస్‌ఆర్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి ని వివరణ కోరగా.. తాము హైకోర్టు ఆదేశాల మేరకే రక్షణ కల్పించామన్నారు. ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా కోర్టు ఆర్డర్స్ ఉన్నాయని, వారికి పోలీస్ రక్షణ కల్పించాలని కోర్టు ఆర్డర్స్ లో ఉన్నాయని తెలిపారు..
– ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.13 నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 8, క్యారెట్ 17, దొండ 28, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 13, దోసకాయ 18, బీట్‌రూట్ 13, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 24, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 85, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఓయూ లైబ్రరీలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ప్రధాన లైబ్రరీలో విద్యార్థుల కోసం సురక్షిత తాగునీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఎస్‌బీఐ ఆర్థిక సహాయంతో నిర్మించిన ఆర్వో యూవీ ప్లాంట్‌ను వీసీ ప్రొ.కుమార్ ప్రారంభించి మాట్లాడారు.

సత్యనారాయణ మృతి బాధాకరం


సత్యనారాయణ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: పార్టీ కార్యక్రమాలలో ఎంతో చురుకుగా పాల్గొనే సత్యనారాయణ మృతి చాలా బాధాకరమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ విచారం వ్యక్తం చేశారు. బేగంపేటకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యనారాయణ గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బుధవారం బేగంపేట చీకోటిగార్డెన్‌లో గల వారి నివాసానికి వెళ్లి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అక్రమాలపై విచారణ చేపట్టండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ప్రభుత్వ సొసైటీ స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్యలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని టీఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌ఎం శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఓయూలో మాట్లాడుతూ పేదల అభివృద్ధికి కృషిచేస్తున్న స్త్రీ నిధిలో అక్రమాలు కొనసాగడం దారుణమన్నారు. స్త్రీ నిధిలో జరిగిన అవకతవకలు, అవినీతి పై విచారణ చేపట్టి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో విలీనం చేయాలని కోరారు.

ఓయూలో కుంగిన ఇంకుడు గుంతలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో నిర్మించిన ఇంకుడు గుంతల్లో కొన్ని ఇటీవల కురిసిన వర్షానికి కుంగిపోయాయి. నాణ్యత లేకుండా నిర్మించినందున ఇంకుడు గుంతల్లో కొన్ని కూలిపోగా మరికొన్నింటికి గుంతలు ఏర్పడ్డాయి. క్యాంపస్‌లో నిర్మించిన 180 ఇంకుడు గుంతల పనుల్లో నాణ్యాత లోపించినందున ఇటీవల కురిసిన వర్షానికి పాడయ్యాయి.

ఘనంగా ఎన్‌సీసీ 5వ బెటాలియన్ రైజింగ్ డే


కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌సీసీ అధికారులు

లాలాపేట: తార్నాక డివిజన్ శాంతినగర్‌లోని తక్షశిలా పబ్లిక్ స్కూల్లో బుధవారం 5వ తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ కల్నల్ రాకేష్ కుమార్, 5వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లక్ష్మణ్ గణేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కల్నల్ రాకేష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణ నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తుందన్నారు. తక్షశిలా పబ్లిక్ స్కూల్ యాజమాన్యం డైరెక్టర్ భాగ్యలక్ష్మీ, ప్రిన్సిపాల్ తనుప్రీత్ కౌర్ తదితరులున్నారు.

రైలు ఢీకొని ట్రాక్‌మెన్ మృతి


సురేష్ మృతదేహం

చిలకలగూడ: పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని రైల్వే ట్రాక్‌మెన్ మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. ఆలేరు రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న సురేష్ నగరంలోని ఆల్వాల్‌లో నివసిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఆలేరులో విధులు ముగించుకుని ఆల్వాల్ రైల్వేస్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనస్థలంలో మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీమార్చురీకి తరలించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

బేగంపేట్ సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ డాకునాయక్



బన్సీలాల్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మకమైన చర్యలతో ముందుకు సాగనున్నట్లు జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ నూతన డిప్యూటీ కమీషనర్ డి. డాకు నాయక్ చెప్పారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. రోడ్లు, వీధిదీపాల ఏర్పాటు, పార్కుల నిర్వహణ, పారిశుధ్యం వంటి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తానన్నారు. సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ నిర్దిష్టమైన కార్యచరణతో కదులుతామన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు తనను నేరుగా సంప్రదించవచ్చన్నారు.ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు.

జై భీమ్ ర్యాలీని విజయవంతం చేయండి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ పిడమర్తి రవి

లాలాపేట: ఈనెల 14ననగరంలో జరిగే జై భీమ్ ర్యాలీని విజయవంతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ డాక్టర్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం హబ్సిగూడ స్వాగత్ గ్రాండ్ హోటల్లో జరిగిన సన్నాహక సమావేశంలో ఉత్సవ కమిటీ చైర్మెన్ మీసాల మల్లేష్, కన్వీనర్ రాపోలు రాములు తదితరులతో కలిసి పాల్గొన్నారు. నిజాం కళాశాల ఎదురుగా ఉన్న డా బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ట్యాంక్ బండ్ వరకు కొనసాగే ఈ ర్యాలీ విజయవంతం కోసం పెద్ద ఎత్తున జనసమీకరణపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కరపత్రం ఆవిష్కరించారు.

భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు


తలసానిని కలిసిన గురుద్వార కమిటీ ప్రతినిధులు

అమీర్‌పేట: అమీర్‌పేట గురుద్వారాలో జరిగే బైసాకి వేడుకల సందర్భంగా హాజరైయ్యే భక్తులకు ప్రసాద వితరణ చేయిస్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ నెల 13 నుండి మూడు రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తున్న నేపథ్యంలో గురుద్వారా ప్రబంధ కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడతానని చెప్పారు. కార్యక్రమంలో అమీర్‌పేట గురుద్వార కమిటీ సభ్యులు మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఎన్‌ఎస్‌యూఐ 55వ ఆవిర్భావ వేడుకలను ఓయూ అధ్యక్షులు మేడ శ్రీను జెండా ఎగురవేసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులతో పాటు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ డా.రియాజ్, వెన్నెల గద్దర్, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.


మాట్లాడుతున్న డా.రియాజ్

ఆలయ వార్షికోత్సవానికి రండి

స్పీకర్‌కు కమిటీ నేతల ఆహ్వానం



చిలకలగూడ: పార్శిగుట్ట బంగారు మైసమ్మ ఆలయ వార్షికోత్సవానికి ప్రత్యేక అతిథిగా హజరు కావాలని కోరుతూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఆలయ నిర్వాహకులు ఆహ్వానపత్రిక అందించారు. ఆలయ చైర్మన్ గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో బుధవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసి శాలువ కప్పి సన్మానించి ఆహ్వానించారు. బంగారు మైసమ్మ ఆలయ 9వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 23 న నిర్వహిస్తున్నామన్నారు. సికింద్రాబాద్ గణేష్ టెంపుల్ ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు దేవేందర్, ఆలయ ప్రతినిధులు ధనశేఖర్ పాల్గొన్నారు.

హనుమాన్ జయంతిని విజయవంతం చేయండి

చిలకలగూడ: బీదలబస్తీ రేణుక ఎల్లమ్మతల్లి దేవాలయం, విశ్వశాంతి యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదిన నిర్వహించే హనుమాన్ జయంతి వేడుకలు, ధ్వజ ఊరేగింపులను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈమేరకు లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు పవన్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ నాయకుడు సందీప్‌రాజ్ తదితరులను బుధవారం కలిసి ఆహ్వానపత్రిక అందించారు. ఆలయ కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు సీతారామ్, శేషగిరిరావు, సభ్యులు మల్లేష్, రాజమౌళి, శ్రీనివాస్, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ



లాలాపేట: ఈ నెల 14న శాంతినగర్ చౌరస్తాలో నిర్వహించతలపెట్టిన భారత రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రిక, కరపత్రాన్ని బుధవారం లాలాపేటలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంజరీ నర్సింగ్ హోమ్ అధినేత,అంబేద్కర్‌వాది డాక్టర్ ఆంజనేయులు ముఖ్యతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాల గీతాదయాకర్‌రావు, కుమార్ షాను, జితేందర్ తదితరులున్నారు.

దొంగ అరెస్టు.. సొత్తు రికవరీ

బౌద్ధనగర్: చోరీ చేసి తప్పించుకుని తిరుగుతున్న ఓ నిందితున్ని వారాసిగూడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రమేష్ గౌడ్ తెలిపిన మేరకు.. ఈ నెల 4న పార్శీగుట్ట సంజీవపురంలోని ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగుల గొట్టి 15 గ్రాముల బంగారం, ఫోన్ దొంగిలించుకుని వెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసికున్న పోలీసులు బుధవారం నిందితుడు ధర్మారావును(20) అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

సర్టిఫికెట్ల జారీలో అక్రమాలను అరికట్టాలి


ఆర్డీఓ సాయిరామ్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మండల రెవెన్యూ పరిధిలో ఆదాయ, ఇతరత్రా ధ్రువీకరణ పత్రాల జారీలో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికట్టాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరామ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిరంజీవి తదితరులు ఆర్డీఓను కలిశారు. రాజీవ్ యువ వికాస్ పథకం కోసం జారీ చేస్తున్న ఆదాయ ధ్రువీకరణ పత్రాల్లో రెవెన్యూ సిబ్బంది అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సికింద్రాబాద్ మండల రెవెన్యూ సిబ్బంది ఆయా ధ్రువీకరణ పత్రాలను పేదలకు సకాలంలో ఇవ్వకుండా ఆఫీసు చుట్టు తిప్పించుకుంటున్నారని ఆరోపించారు.

అనారోగ్యంతో వైద్యురాలి మృతి

అమీర్‌పేట: అనారోగ్యం కారణంగా ఓ వైద్యురాలు మృతి చెందింది.ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన మేరకు..చిత్తూరు జిల్లా రేణిగుంట గ్రామానికి చెందిన సుస్మిత ప్రియ (30) ఎస్‌ఆర్‌నగర్‌లోని అన్నపూర్ణ డీలక్స్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటూ బల్కంపేటలోని గ్లోబల్ చైల్డ్‌కేర్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఫిజియోథెరపి వైద్యురాలిగా పనిచేస్తోంది. మంగళవారం ఉదయం డ్యూటీకి బయలుదేరుతుండగా ఒక్కసారిగా కింద పడింది.హాస్టల్ నిర్వాహకులు వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వారం క్రితం తల్లికి ఫోన్ చేసి తనకు గుండెలో నొప్పి వస్తోందని తెలిపిందని తండ్రి మస్తాన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇకనైనా ఎన్నికలు జరిపించండి

సీఈఓకు మాజీ బోర్డు సభ్యుల వినతిపత్రం


సీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు ఎన్నికలు జరిగి పదేళ్ల అవుతోందని, ఇప్పటికైనా ఎన్నికలు నిర్వహించాలని బోర్డు మాజీ సభ్యులు కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ బోర్డు సభ్యులు పాండుయాదవ్, లోకనాథం , శ్యామ్ కుమార్, నళిని కిరణ్, బీఆర్‌ఎస్ నేత సాయి కుమార్‌లు సీఈఓ మధుకర్ నాయక్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ది కంటోన్మెంట్స్ యాక్ట్ –2006, సెక్షన్ 12 (3) (ఏ) ప్రకారం ప్రతి ఐదేళ్లకోసారి బోర్డు ఎన్నికలు జరిపించాలన్నారు. 2015 జనవరిలో తాము బోర్డు సభ్యులుగా ఎన్నికయ్యామని, తిరిగి ఇప్పటి వరకు ఎన్నికలు జరగలేదన్నారు. వార్డుల వారీగా ప్రజాప్రతినిధులు లేకపోవడంతో పలు సమస్యలు అధికారుల దృష్టికి రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో తాము గుర్తించిన కొన్ని ముఖ్యమైన పనులు సత్వరమే చేయాలని కోరారు.

- ఎనిమిదో వార్డు రీసాల బజార్ కమ్యూనిటి నిర్మాణం నాలుగేళ్లుగా అసంపూర్తిగా ఉందన్నారు.
- ఆరోవార్డు పరిధిలోని రామన్నకుంట ప్రక్షాళన పనులు సత్వరమే చేపట్టాలని కోరారు.
- అన్ని వార్డుల పరిధిలో సమస్యల పరిష్కారానికి సంబంధించిన వర్క్ ఆర్డర్లను విడుదల చేయాలని కోరారు.
- రానున్న వర్షాకాలంలో ప్రజలు అసౌకర్యానికి గురి కాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని కోరారు.

'రాజీవ్ యువశక్తి'ని సద్వినియోగం చేసుకోవాలి


సిబ్బందితో సమీక్షిస్తున్న తిరుమలగిరి తహసీల్దార్ (ఇంచార్జ్) సాయికుమార్

కంటోన్మెంట్: రాజీవ్ యువ వికాసం పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని తిరుమలగిరి మండల ఇంచార్జ్ తహసీల్దార్ సాయికుమార్ అన్నారు. మండల పరిధిలోని అర్హులు వార్డుల వారీగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. తిరుమలగిరి మండల పరిధిలో ఆన్‌లైన్ ద్వారా ఇప్పటివరకు 1290 మంది ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోగా, కేవలం 300 దరఖాస్తులు మాత్రమే మండల కార్యాలయానికి వచ్చాయన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు కార్పొరేటర్ పరామర్శ


బాధితులను పరామర్శిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: అగ్ని ప్రమాదంలో ఇంట్లో సామగ్రి మొత్తం కాలిపోవడంతో స్థానిక కార్పొరేటర్ కంది శైలజ బాధితులను పరామర్శించారు. ఈ నెల 8న రాత్రి ఎల్ఎన్‌నగర్‌లో నవాబ్ ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగింది. వచ్చే నెలలో నవాబ్ కూతురు పెళ్లి నిశ్చయం చేశారు. ఈ క్రమంలో పెళ్లికోసం తెచ్చిన సామగ్రి మొత్తం కాలిబూడిదైంది. బుధవారం కార్పొరేటర్ కంది శైలజ బాధితులను పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులు బెజ్జంకి రాజేష్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మస్తాన్ బాబా, బాకర్, అహ్మద్, అంజద్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

నేటి నుంచి మహనీయుల జయంత్యుత్సవాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో గురువారం నుంచి (10న) మహనీయుల జయంత్యుత్సవాలు జరగనున్నాయి. మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతులను పురస్కరించుకొని ఈ నెల 10 నుంచి 13 వరకు వరుస కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 11న వివిధ అంశాల పై సదస్సులు, వర్క్‌షాప్‌లు, వ్యాసరచన, ఉపన్యాసాలు పోటీలు, గోడ పత్రికల రూపకల్పన, వెబినార్, సాంస్కృతిక పోటీలను నిర్వహించనున్నారు. గురువారం ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ముగింపు సమావేశాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతారన్నారు.

రేషన్‌షాపుల్లో కార్పొరేటర్ తనిఖీ


రేషన్‌షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లోని పలు రేషన్‌షాపుల్లో కార్పొరేటర్ సామల హేమ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలువురు వినియోగదారులతో మాట్లాడి నిత్యావసర సరుకులు పంపిణీ తీరుతెన్నులపై ఆరా తీశారు. పంపిణీలో అవకతవకలకు పాల్పడితే, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

మురుగు సమస్యను పరిష్కరిస్తా

మహ్మద్‌గూడలో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని కార్పొరేటర్ సామల హేమ హామీ ఇచ్చారు. బుధవారం పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. జలమండలి సెక్షన్ మేనేజర్ నవ్య పాల్గొన్నారు.

తండ్రికి మతిస్థిమితం లేని బాలుడి అప్పగింత

వెంగళరావునగర్: మతిస్థిమితం సరిగా లేని బాలుడిని మధురానగర్ పోలీసులు గుర్తించి అతడి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... మధురానగర్ పీఎస్‌కు చెందిన పోలీసులు మంగళవారం అర్ధరాత్రి పెట్రోలింగ్ చేస్తుండగా గుర్తుతెలియని బాలుడు లేడీస్ హాస్టల్‌లోకి ప్రవేశించాడని వారికి ఫోన్ వచ్చింది. దాంతో హుటాహుటిన పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అనంతరం అతడిని పట్టుకుని విచారించారు. అతని మానసిక పరిస్థితి సరిగ్గా లేదని గ్రహించిన పోలీసులు తల్లిదండ్రుల వివరాలు అడగ్గా ఎల్లారెడ్డిగూడకు చెందిన రాజు తన తండ్రి అని చెప్పాడు. దాంతో ఆ బాలుడిని వారి ఇంటికి తీసుకెళ్లి రాజుకు చూపించగా అతడిని తమ కుమారుడని తెలిపారు. మతిస్థిమితం సరిగ్గా ఉండదని తండ్రి తెలియజేశారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

లాలాపేట: ఈనెల 12న నిర్వహించనున్న వీర హనుమాన్ విజయ యాత్రను విజయవంతం చేయాలని వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత ఉపాధ్యక్షురాలు బేరీ సునీత కోరారు. బుధవారం లాలాపేటలో ఇందుకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పి జిల్లా సెక్రటరీ రజినీ కాంత్, జిల్లా జాయింట్ సెక్రటరీ రాజిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుపై వ్యర్థాలు.. ప్రయాణికుల ఇబ్బందులు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని ఓపెన్ నాలాలో ఇటీవల పూడిక తీశారు. అయితే మట్టి వ్యర్థాలను పెద్ద ఎత్తున రోడ్డుపై గుట్టలుగా పోసి వదిలేసారు. రోజుల తరబడి ఇలానే వదిలేయడంతో మట్టి వ్యర్థాలు వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. లాలాపేట నుంచి సత్యానగర్, ఇందిరానగర్, చంద్రబాబునగర్ బస్తీల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా రోడ్డుపై వేసిన పూడిక మట్టి వ్యర్థాలను వెంటనే తొలగించాలనీ ఇందిరానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు నేతికార్ మహేశ్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.


రోడ్డుపై గుట్టలుగా పోసిన నాలా పూడిక మట్టి కుప్పలు